http/www.tholipoddu.com

# తొలిపొద్దు

డిజిటల్ డైలీ

31-05-2025 శనివారం

సంపుటి : 1 | సంచిక : 261 | పేజీలు 4 వెల : 5

Circulated in Hyderabad, Ranga Reddy, Adilabad, Nizamabad, Karimnagar, Warangal, Mahabubnagar, Nalgonda, Sangareddy, Khammam and Kurnool

## ప్రపంచ సుందరి ఎవరో?

**హైదరాబాద్:** ప్రపంచ సుందరి-2025 ఎవరో తేలే సమయం ఆసన్నమైంది. విశిష్ట అతిథులు.. బాలీవుడ్ తారల ప్రదర్శనల నడుమ హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదికగా శనివారం మిస్‌వరల్డ్ పోటీల ఫైనల్ జరగనుంది. కిరీటాన్ని సొంతం చేసుకునేందుకు 108 దేశాల అందాలభామలు పోటీపడుతున్నారు. మిస్ ఇండియా నందిని గుప్తా సహా 16 మంది సుందరీమణులు ఇప్పటికే టాప్ 40కి చేరుకున్నారు. మరో 24 మందిని న్యాయనిర్ణేతలు శనివారం ఎంపిక చేయనున్నారు. పలు దఫాల వడబోత అనంతరం చివరి దశలో అమెరికా-కరేబియన్, ఆఫ్రికా, యూరప్, ఆసియా-ఓషియానా ఖండాల నుంచి ఒక్కొక్కరిని ఎంపిక చేస్తారు. ఈ నలుగురిలో తుది ప్రశ్న ద్వారా మిస్‌వరల్డ్‌ను ప్రకటిస్తారు. మిస్ వరల్డ్ 2024 క్రిస్టినా పిజ్కోవా 72వ ప్రపంచ సుందరికి కిరీటాన్ని ధరింపజేస్తారు. ఫైనల్‌కు వేదికైన హైటెక్స్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. విద్యుత్తు కాంతులతో శోభాయమానంగా తీర్చిదిద్దారు.

# అభివృద్ధికి రోల్ మాడల్ మా రాష్ట్రం

## బిఆర్ఎస్ హయాంలో రూ. 3.5 లక్షల కోట్ల పెట్టుబడులు



**లక్షల మంది యువతకు ఉద్యోగ అవకాశాలు**

**కాళేశ్వరం ప్రపంచ అద్భుతాల్లో ఒకటి**

**పరిశ్రమలకు దన్నుగా టీఎస్ ఐపాస్**

**సంపద సృష్టి, సమాన పంపిణీలో ఫస్ట్**

**తలసరి ఆదాయంలో దేశంలోనే టాప్**

**కాళేశ్వరం చైనా త్రీ గోర్జెస్‌తో సమానం**

**గ్లోబల్ టెక్ హబ్‌గా హైదరాబాద్**

**ఇది బీఆర్ఎస్ సాధించిన విజయం**

**దేశ విదేశాలకు తెలంగాణ ఆదర్శం**

**బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ ప్రగతిని ఆవిష్కరించిన కేటీఆర్**

**డాలస్‌కు పోటెత్తనున్న యువకెరటాలు.. రేపే రజతోత్సవ సభ**

**తొమ్మిదేళ్ల తెలంగాణ విజయంపై కెటిఆర్ ప్రసంగం**

**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో.. పదేండ్లలో 8 వేలకు పైగా అనుమతులు, రూ. 3.5 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. దీంతో లక్షల మంది యువతకు ఉద్యోగ అవకాశాలు వచ్చాయని కేటీఆర్ పేర్కొన్నారు. లండన్‌లో జరుగుతున్న బ్రిడ్జ్ ఇండియా వీక్ 2025 సదస్సులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని ప్రధాన ఉపన్యాసం ఇచ్చారు. సదస్సులో.. 'స్థిరమైన వృద్ధితో ప్రపంచ ఆర్థిక రంగాన్ని నడిపించడం లో తెలంగాణ ఎందుకు ముఖ్య' అనే అంశంపై కేటీఆర్ ప్రధాన ఉపన్యాసం ఇచ్చారు. ఈ సదస్సులో వివిధ దేశాల రాజకీయ నాయకులు, ప్రభావశీల వ్యక్తులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో 9 ఏండ్ల బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి కేంద్రంగా సాగిన పాలన, ఆలోచనలు అద్భుత ఆవిష్కరణలుగా మారిన విధానంతో పాటు- తెలంగాణ విజయ ప్రస్థానాన్ని కేటీఆర్ తన ప్రధానోపనాస్యంలో వివరించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో దేశంలోనే తెలంగాణ నంబర్ వన్‌గా నిలిచిందని కేటీఆర్ తెలిపారు. హైదరాబాద్‌లో టాప్ 5 మల్టీనేషనల్ కంపెనీల అతిపెద్ద క్యాంపస్‌లు నెలకొల్పాయి. టీఎస్ ఐపాస్‌తో సెల్ఫ్ సర్టిఫికేషన్ విధానం ప్రవేశపెట్టాం. కేసీఆర్ తీసుకొచ్చిన టీ-ఎస్ ఐపాస్‌తో పెట్టు-బడులను భారీగా ఆకర్షించింది. దేశంలోని ఏ రాష్ట్రంలోనూ ఇలాంటి విప్లవాత్మక విధానం లేదు. పదేండ్లలో 8 వేలకు పైగా అనుమతులు, రూ. 3.5 లక్షల కోట్ల పెట్టు-బడులు వచ్చాయి. తెలంగాణకు ఐటీ- కంపెనీలు తీసుకువచ్చి 10 లక్షల మంది స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాము. మినిమమ్ గవర్నమెంట్.. మ్యాగ్జిమమ్ గవర్నెన్స్ మా విధానం. తెలంగాణలో పెట్టు-బడులు పెట్టండి. తెలంగాణలో ప్రతి ఇంటికి సురక్షిత మంచినీరు అందించామని కేటీఆర్ గుర్తు చేశారు. దృఢ నాయకత్వం, ప్రజల జీవితాలను మర్చాలన్న చిత్తశుద్ధి ఉంటే అద్భుతమైన ప్రగతి సాధ్యమని తెలంగాణ రాష్ట్రం నిరూపించిందని అన్నారు. తొమ్మిదేళ్ల భారాస పాలనలో తెలంగాణ సాధించిన విజయాలు దేశానికే కాదు ప్రపంచానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. సంపద సృష్టించడంతో పాటు- సమాజంలోని అట్టడుగు వర్గాలకు సమానంగా పంచడమే తమ హయాంలో తెలంగాణను దేశంలోనే ప్రత్యేకంగా నిలిపిందని వివరించారు. భారాస హయాంలో అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో విప్లవాత్మక పంథాను అనుసరించి వివిధ రంగాల్లో తీసుకొచ్చిన మార్పులు, విధానాలపై తన అనుభవాలు, ఆలోచనలను పంచుకున్నారు. కేసీఆర్ నాయకత్వంలోని భారాస ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి మధ్య అద్భుత సమతుల్యత సాధించిందన్నారు. తమ హయాంలో పాలనను ప్రజలకు చేరువ చేయడంతో పాటు- ప్రభుత్వ జోక్యాన్ని తగ్గించి వ్యక్తుల కంటే విధానాలకే ప్రాధాన్యత ఇచ్చామన్నారు. విప్లవాత్మక మార్పులను ఆహ్వానించడంతో పాటు- నిర్ణయాధికారాన్ని వికేంద్రీకరించడమే తెలంగాణను మిగతా రాష్ట్రాల కంటే ప్రత్యేకంగా మార్చిందని తెలిపారు.

# పార్టీలో పదేళ్లు ఎంతో ఆవేదన అనుభవించా

**నా లేఖను బహిర్గతం చేసినవారికి అది అంతర్గత అంశమని తెలియదా?**

**కొత్త పార్టీ పెట్టే ఆలోచన లేదు**

**భాజపాతో జతకట్టే పార్టీలకు భవిష్యత్తు ఉండదు: ఎమ్మెల్సీ కవిత**



**ఆదిలాబాద్:** భాజపాతో జతకట్టే పార్టీలకు రాజకీయంగా కొంతకాలం కలిసి వస్తుందేమో కానీ దీర్ఘకాలిక భవిష్యత్తు ఉండదని.. ఆ తర్వాత మరుగున పడటం ఖాయమని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అభిప్రాయపడ్డారు. ఇదే విషయాన్ని తాను కేసీఆర్‌కు చెప్పానన్నారు. పార్టీలో పదేళ్లుగా ఎన్నో ఆవేదనలను అనుభవించానని చెప్పారు. శుక్రవారం వివిధ ప్రైవేటు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మంచిర్యాలకు వచ్చిన ఆమె మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. తెలంగాణను సాధించిన పార్టీని గుండెల్లో పెట్టుకొని కాపాడుకోవాలనేది తన తాపత్రయం తప్పితే కొత్త పార్టీ పెట్టాలనే ఆలోచన లేదని స్పష్టంచేశారు. 'ఏవైనా సమస్యలుంటే పార్టీలో అంతర్గతంగా చర్చించుకోవాలని.. గీతదాటొద్దని కొంతమంది అంటున్నారు. మరి నేను రాసిన లేఖ అంతర్గతమే కదా.. దాన్ని బయటపెట్టింది ఎవరు?' అని ప్రశ్నించారు. కేసీఆర్ భోజనం చేసే సమయంలోనూ ప్రజాసమస్యలపైనే చర్చిస్తారు తప్ప కుటుంబానికి, వ్యక్తిగత అంశాలకు తావీయరని.. అందుకే లేఖలు రాస్తానని కవిత చెప్పారు. "భవిష్యత్తులో ఏం జరుగుతుందో.. 20 ఏళ్ల ముందే పసిగట్టగలను. ఎంపీగా ఉన్నప్పుడే బీసీల రిజర్వేషన్లు, మహిళా బిల్లు అంశాలను పార్లమెంటు వేదికగా లేవనెత్తాలని కేసీఆర్ దృష్టికి తీసుకొచ్చా. అప్పుడు పట్టించుకోలేదు. ఇప్పుడేమైంది.. నేను ఆలోచించినట్లుగానే జరుగుతోంది కదా.. ఒకవేళ నేను చెప్పినట్లుగా ఆనాడే రాజకీయ విధానాన్ని ప్రకటించి ఉంటే ఆ పేరు భారాసకు వచ్చేది. సింగరేణిలో, పార్టీలో కొత్త నాయకత్వానికి అవకాశం కల్పించాలని చెప్పినా పట్టించుకోలేదు. చెప్పి లాభం లేదనుకొని తెలంగాణ జాగృతిలో కొత్తతరానికి అవకాశం కల్పించాం. పార్టీని కాపాడుకోవాలనే తాపత్రయంతోనే ముందుకు వెళ్తున్నా.. నాపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారని అనుకోవడం లేదు. లిక్కర్ స్కాంలో నన్ను ఇరికించే ప్రయత్నం చేశారు. నేను నిర్దోషిని. నా లేఖతో కాంగ్రెస్, భాజపాలకు రాజకీయంగా ఎలాంటి మేలు జరగదు" అని కవిత పేర్కొన్నారు. శ్రీరాంపూర్ నుంచి కారులో వస్తున్న జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్, జగిత్యాలకు చెందిన వసంతను 'కాబోయే ఎమ్మెల్యే' అని కవిత వ్యాఖ్యానించారు. భారాస నుంచా లేక కొత్త పార్టీ తరఫునా అని మీడియా ప్రశ్నించగా.. పక్కా భారాస నుంచే అని స్పష్టంచేశారు. ఆమె పర్యటనలో భారాస సభ్యులెవరూ పాల్గొనలేదు. భాజపా మానవత్వం లేని పార్టీ అని.. ఆపరేషన్ కగార్ పేరిట మారణకాండ సృష్టించిందని కవిత మండిపడ్డారు. మంచిర్యాలలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన జర్నలిస్ట్ మునీర్ కుటుంబ సభ్యులను పరామర్శించిన అనంతరం ఆమె అక్కడే మీడియాతో మాట్లాడారు. నంబాల కేశవరావు సహా ఇతర మావోయిస్టు నేతల్ని కాల్చిచంపి.. మృతదేహాలను సైతం కుటుంబీకులకు ఇవ్వలేదని మండిపడ్డారు. సరస్వతి పుష్కరాల్లో పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణకు ప్రొటోకాల్ పాటించకపోవటం, గతంలో యాదాద్రిలో ఉపముఖ్యమంత్రి భట్టికి అవమానం ఘటనలతో కులప్రభావం ఎక్కువగా ఉన్నట్లు బయటపడిందన్నారు. కాంగ్రెస్, భాజపా విధానాలను ఖండించాలన్నారు.

# కవిత పంచాయితీలో బిజెపిని ఎందుకు లాగుతారు

**బిఆర్ఎస్‌ను విలీనం చేసుకునే ఖర్మా మాకు పట్టలేదు**

**పదేళ్ల దోపిడీ చేసి...ఉద్యమకారులను అన్యాయం చేశారు**

**కాంగ్రెస్, టిడిపిలతో పొత్తు పెట్టుకున్నచరిత్ర వారిది**

**దమ్ముంటే కవిత మీడియా ముందు నిజాలు వెళ్లగక్కాలి**

**పాక్‌తో యుద్ధంపై రేవంత్ వ్యాఖ్యలు దుర్మార్గం**

**మీడియా సమావేశంలో బిజెపి ఎంపి రఘునందన్ రావు**



**హైదరాబాద్:** కవిత తన పంచాయితీ విషయాన్ని తండ్రి, అన్న కెటిఆర్‌లతో తేల్చుకోవాలని, మధ్యలో బిజెపిని ఎందుకు లాగుతోందని ఆ పార్టీ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. బిఆర్ఎస్ వస్తామన్నా కలుపుకోవడానికి సిద్దంగా బిజెపి లేదని స్పష్టం చేశారు. ఈముందని మిమ్ములను చేర్చుకుంటామని అన్నారు. బిజెపి తెలంగాణలో అధికారంలోకి వస్తుందని, కార్యకర్తలు కూడా అందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. అలాగే భాజపా ఎదుగుదలను ఆపాలని కుట్రలు పన్నుతున్నారని ఆ పార్టీ ఎంపీ రఘునందన్‌రావు ఆరోపించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా భారాస ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలపైనా ఆయన స్పందించారు. చిట్‌చాట్‌లు ఎందుకు?.. ధైర్యముంటే ప్రెస్‌మీట్‌లు పెట్టండి. తప్పుడు వార్తలు రాయిస్తున్నారని చెప్పడం ఎందుకు? భారాసతో మా పార్టీ అధిష్ఠానం ఎప్పుడూ మాట్లాడలేదు. లేనిపోని పంచాయితీలు ఎందుకు?.. కుండబద్ధలు కొట్టినట్లు- చెప్పండి. చిట్‌చాట్‌ల పేరుతో మా పార్టీని వివాదంలోకి లాగొద్దని కవితకు విజ్ఞప్తి చేస్తున్నా. మీ సొంత పంచాయితీలు మీరే తేల్చుకోండి.. మమ్మల్ని లాగొద్దు. తెరాస గతంలో అనేక పార్టీలతో పొత్తు పెట్టుకుంది. 2004లో కాంగ్రెస్‌తో తెరాస పొత్తు పెట్టుకుంది. 2009లో మహా కూటమి పేరుతో పలు పార్టీలతో పొత్తు పెట్టుకుంది. 2014లో పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేస్తామన్నది ఎవరు? భారాసతో భాజపా ఎప్పుడైనా పొత్తు పెట్టుకుందా? రాష్ట్రంలో భాజపా బలం పుంజుకుంటోంది.. కాంగ్రెస్ పార్టీ ప్రజల విశ్వాసాన్ని కోల్పోతోంది.

# కాశ్మీర్ సమస్యను రగిల్చిందే కాంగ్రెస్

**75 ఏళ్లయినా రావణకాష్టంలా రగులుతోంది**

**ఆనాడే ఇందిర పివోకేను ఎందుకు స్వాధీనం చేసుకోలేే**

**రేవంత్ వ్యాఖ్యలు దారుణమన్న ఎంపి ఈటెల రాజేందర్**



**హైదరాబద్:** స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు అయిన ఇంకా కశ్మీర్ సమస్య అలాగే ఉంది అంటే దానికి కారణం కాంగ్రెస్ పార్టీ కాదా అని ఎంపి ఈటెల రాజేందర్ ప్రశ్నించారు. కశ్మీర్ కి స్వతంత్రపతిపత్తి ఇచ్చి వివాదానికి ఆజ్యం పోసింది కాంగ్రెస్ పార్టీ కాదా అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రంగా స్పందించారు. ఆనాడు ఇందిర గాంధీ పాక్ ఆక్రమిత కశ్మీర్ ను స్వాధీనం చేసుకొని ఉంటే ఈనాడు భారత్ దేశానికి ఈ పరిస్థితి వచ్చి ఉండేదా అని నిలదీశారు. 370 ఆర్టికల్ ను రద్దుచేసి కశ్మీర్‌ని భారత దేశంలో అంతర్భాగం చేసిన ధీరుడు నరేంద్ర మోడీ అని.. మోడీ మీద విమర్శలు చేయడం సూర్యుని మీద ఉమ్మివేయడమనని తెలిపారు. ప్రపంచంలోనే నరేంద్ర మోడీ పెద్దన్న పాత్రను పోషిస్తున్నారని.. రష్యా ఉక్రెయిన్ యుద్ధం కూడా ఆగాలని కోరుకున్న వ్యక్తి మోడీ అని కొనియాడారు. సమస్య పరిష్కరించడం ముఖ్యమని.. దేశ భద్రత పట్ల కాంగ్రెస్ పార్టీ, ఆ పార్టీ నాయకులు మాట్లాడడం దయ్యాలు వేదాలు వల్లించినట్లే ఉందని దుయ్యబట్టారు. ప్రాసకోసం, రాజకీయంకోసం మీరు మాట్లాడుతున్న మాటలు సైనికుల ఆత్మస్థయిర్యాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. జైహింద్ పేరుతో సైనికుల కోసమని ర్యాలీ పెట్టి రాహుల్ గాంధీని ప్రధాని చేద్దాం అంటారు.. ఏం మాట్లాడుతున్నారో సోయి ఉండే మాట్లాడుతున్నారా అని మండిపడ్డారు. ఢిల్లీలో వెళ్లి మోడీని పొగుడుతారు.. గల్లీలో వచ్చి తిడతారని విమర్శించారు.. కేంద్ర ప్రభుత్వ చేస్తున్న పనులపై మీ మంత్రులు కొనియాడతారు.. మీరేమో తిడతారు.. ఇదేనా మీ నైజం? అని తీవ్రంగా మండిపడ్డారు.



# రాజకీయ కక్షతోనే కాళేశ్వర కమిషన్ ఏర్పాటు

**కమిషన్ ముందు చర్చించే అంశాలపై కెసిఆర్ చర్చలు**

**హరీష్ రావుతో సుదీర్ఘంగా చర్చించిన కెసిఆర్**

**గజ్వేల్:** కేవలం రాజకీయ కక్షతోనే కాంగ్రెస్ పార్టీ కాళేశ్వరం విచారణ కమిషన్ ఏర్పాటు- చేసిందని కేసీఆర్ ఆరోపణలు చేశారు. జూన్ 5న కేసీఆర్, జూన్ 9న హరీష్ రావు కాళేశ్వరం కమిషన్ ఎదుట విచారణలో వినిపించాల్సిన వాదనలు, వివరణలపై చర్చలు జరిపారు. ఎర్రవెల్లి ఫాంహౌస్‌లో కేసీఆర్, హరీష్‌రావు భేటీ ముగిసింది.. సుమారు మూడున్నర గంటలపాటు సమావేశం కొనసాగింది. కాళేశ్వరం కమిషన్ ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటివరకు జరిగిన విచారణపై కేసీఆర్ సమీక్ష నిర్వహించారు. కాళేశ్వరంపై ఎన్‌డీఎస్ఏ ఇచ్చిన రిపోర్టును నిర్మాణ సంస్థను తప్పు పట్టడంపై చర్చించారు. ఎలాంటి పరీక్షలు నిర్వహించకుండా బ్యారేజీపై రిపోర్ట్ ఎలా ఇస్తారన్న ఎల్ అండ్ టీ సంస్థ ప్రశ్నని కమిషన్ ఎదుట ప్రస్తావించాలని నిర్ణయించారు. నిర్మాణ సంస్థ లేఖతో ఎన్‌బీఎస్ఏ నివేదికలో డొల్లతనం బయటపడిందని కేసీఆర్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రాజెక్టు శంకుస్థాపన నుంచి నిర్మాణం పూర్తయ్యేవరకు జరిగిన ప్రక్రియనంతా వివరించేందుకు వీలుగా తగినంత సమయం ఇవ్వాలని కమిషన్ కోరనున్నట్లు నిర్ణయించారు. కాగా.. కాళేశ్వరం బ్యారేజీలపై న్యాయ విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎదుట మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరు కావాలని నిర్ణయం తీసుకున్నట్లు ఇటీ-వల తెలిసింది. జూన్ 5న కమిషన్ ఎదుట విచారణకు హాజరుకావాలని ఈ నెల 21న జస్టిస్ ఘోష్ నోటీసు పంపారు. దానికి స్పందించి హాజరుకావాలా లేదా అన్నదానిపై కేసీఆర్ న్యాయ నిపుణులతోనూ, పార్టీ నాయకులతోనూ చర్చిస్తున్నారు.

# కాళేశ్వరంపై మరోమారు కుట్రలు

**ఈటెలతో హరీష్ రావు రహస్య భేటీ**

**కమిషన్ ముందు ఒక్కటే సమాధానం చెప్పాలని నిర్ణయం**

**కెసిఆర్ ఆదేశాలతోనే ఈటెలతో హరీష్ భేటీ**

**ట్రంప్ ఒత్తిడితో పాక్‌తో యుద్ధం విరమించడం దారుణం**

**పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఘాటు విమర్శలు**

**హైదరాబాద్:** కాళేశ్వరం కమిషన్ విషయంలో అంత ఒకటే సమాధానం చెప్పాలని హరీష్ రావు, ఈటెల రాజేందర్ అవగాహనకు వచ్చారని పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు షామిర్ పేటలో రహస్యంగా కలిశారని అన్నారు. గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు ఒక ఫామ్ హౌస్ లో సీక్రెట్‌గా కలిశారని ఆరోపించారు. కేసీఆర్ చెప్పారు కాబట్టే హరీష్, ఈటల కలిశారన్నారు. కాళేశ్వరం కమిషన్ విషయంలో అంత ఒకటే సమాధానం చెప్పాలని మాట్లాడు కున్నారన్నారు. ఈ అంశంపై ఈటల రాజేందర్ సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటే అని వందసార్లు చెప్పామన్నారు. కవిత బీజేపీ మీద సర్జికల్ సర్జికల్ స్ట్రయిక్ చేస్తోందని.. దానిపై బీజేపీ సమాధానం చెప్పాలన్నారు. భాజపా, భారాస సయోధ్య గురించి కవిత ఇప్పుడు బయటపెడుతున్నారు. బండి సంజయ్‌ను భాజపా అధ్యక్ష పదవి నుంచి అన్యాయంగా తొలగించలేదా? భారాసతో దోస్తీకి అడ్డుగా ఉన్నందుకే సంజయ్‌ను తొలగించింది వాస్తవం కాదా? భాజపా నేతల ప్యాకేజీల గురించి రాజాసింగే చెబుతున్నారు. రాజాసింగ్ మాటలకు ఆ పార్టీ పెద్దలు సమాధానం చెప్పాలి. షామీర్‌పేటలోని ఓ ఫామ్‌హౌస్‌లో ఈటల రాజేందర్, హరీశ్‌రావును కలిశారు. ఇద్దరూ కలిసి కేసీఆర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. ఈటల రాజేందర్.. మోదీ పార్టీలో ఉన్నారా?కేసీఆర్ పార్టీలో ఉన్నారా? కాళేశ్వరం స్కామ్ నుంచి బయటపడేందుకు ఈటల.. కేసీఆర్‌తో చేతులు కలుపు తున్నారని మహేశ్‌కుమార్‌గౌడ్ ఆరోపించారు. కాళేశ్వరం కమిషన్ కేసీఆర్ కు ఏటీఎంలా మారిందని ఆనాడు జేపీ నడ్డా ఆరోపించారు. ఆ ఆరోపణలను ఈటల నిజం చేస్తారా? లేక కేసీఆర్ తో ఉన్న పాత దోస్తీతో అబద్ధాలు చెప్తారా? ఈటల బీజేపీ మనిషా.. ఎవరి మనిషో విచారణ రోజు బయటపడుతుందన్నారు.



## బడి ఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలి

### తల్లిదండ్రుల భాగస్వామ్యంతో ఆదర్శనంగా రామంచ పాఠశాల

### ప్రధానోపాధ్యాయులు అబ్దుల్లా షరీఫ్

**తొలిపొద్దు, సిద్దిపేట / చిన్నకోడూరు :** తల్లిదండ్రులు బడి ఈడు పిల్లలందరిని ప్రభుత్వ బడిలో చేర్పించి పాఠశాలను బలోపేతం చేయాలని రామంచ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్దుల్లా షరీఫ్ అన్నారు. శుక్రవారం రామంచ గ్రామంలో బడిబాట కార్యక్రమం నిర్వహించి తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమం తప్పకుండా ప్రతిరోజు విద్యార్థులను పాఠశాలకు పంపించాలన్నారు. మన పాఠశాలలో అమలు జరుగుతున్న బోధనా రీతులు, దాతల సాయంతో చేయూతనందిస్తున్న కార్యక్రమాలను ప్రైవేటు పాఠశాలకు వెళ్లే విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి మన పాఠశాలలో చేరేలా చూడాలని కోరారు. మన పాఠశాలను ఆదర్శంగా నిలిపేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. మేము ప్రత్యేక కృషికి తోడు మన ప్రభుత్వ పాఠశాల పటిష్టతలో తల్లిదండ్రులు భాగస్వామ్యం కావాలన్నారు. ఈ సందర్భంగా ఇద్దరు విద్యార్థులు యుకేజీలో కొత్తగా జాయిన్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేష్ కుమార్, వరప్రసాద్, యాదయ్య, సునీత, వాణి లతోపాటు తల్లిదండ్రులు స్వామి, రాజు తదితరులు పాల్గొన్నారు.



## ఎల్లమ్మ దేవాలయ నిర్మాణానికి రూ.3,12,227 ల విరాళం

### దార్మికతను చాటుకున్న నాగపూర్ దంపతులు

**తొలిపొద్దు, నంగునూరు :** సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంలోని పెద్ద తాళ్ళల్లో నిర్మిస్తున్న ఎల్లమ్మ దేవాలయ నిర్మాణానికి మహారాష్ట్రలోని నాగపూర్ లో నివాసముంటున్న రెండు కుటుంబాలకు చెందిన దంపతులు కలిసి రూ.3,12,227లు విరాళం అందించారు. నాగపూర్ లో నివాసం ఉంటున్న మంత పురి లక్ష్మి, రాజు గౌడ్ దంపతులు రూ.2,01, 116 లు(రెండు లక్షల ఒక వెయ్యి ఒక వంద పదహారు రూపాయలు), నాసగోని కళావతి, బాలా గౌడ్ దంపతుల కుమారుడు నరేశ్ గౌడ్ రూ.1,11,111లు(ఒక లక్ష పదకొండు వేల నూట పదకొండు రూపాయలు) విరాళం అందించారు. ఈ మేరకు డబ్బులను నంగునూరులోని పెద్ద తాళ్ళ గౌడ సంఘం సభ్యులకు శుక్రవారం అందించారు. ఆలయ నిర్మాణానికి విరాళం అందించినందుకు పెద్ద తాళ్ళ గౌడ సంఘం సభ్యులు దాతలు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎసి కంప్రెసర్ పేలి అగ్నిప్రమాదం

**హైదరాబాద్:** ఎసి కంప్రెసర్ పేలడంతో అగ్నిప్రమాదం సంభవించిన సంఘటన హైదరాబాద్‌లోని మధురానగర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. మధురానగర్‌లోని రెసిడెన్షియల్ బిల్డింగ్‌లో ఎసి కంప్రెసర్ పేలిపోయింది. జి ప్లస్ 5 బిల్డింగ్ రెండో అంతస్థులోని ఎసి కంప్రెసర్ పేలడంతో ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. దీంతో అపార్ట్‌మెంట్ ప్రాంతంలో పొగలు దట్టంగా కమ్ముకున్నాయి. వెంటనే స్థానికులు అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పి వేశారు. అగ్నిప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

## పదో తరగతి పరీక్షల పునర్ మూల్యాంకనం

**అమరావతి:** పదోతరగతి పరీక్ష జవాబు పత్రాల పునర్ మూల్యాంకనంలో లోటు పాట్లంటూ వచ్చిన వార్తలకు సంబంధించి ఏపీ విద్యాశాఖ (శుక్రవారం కీలక ప్రకటన విడుదల చేసింది. ఈ వ్యవహారంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఎవల్యూషన్‌లో పొరపాట్లు చేసినట్లు గుర్తించింది. పదోతరగతి పేపర్లు దిద్దిన ఐదుగురు ఎవల్యూవేటర్లను సస్పెండ్ చేస్తూ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి రీవెరిఫికేషన్- 64,251, రీకౌంటింగ్- 2112 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 55,118 పేపర్లు.. 24,550 మంది విద్యార్థులకు సంబంధించినవి ఉన్నాయి. మూల్యాంకనంలో నిర్లక్ష్యం వహించినట్లుగా భావించిన 144 పేపర్లు ఒక మార్కు తేడాతో వచ్చినవేనని విద్యాశాఖ గుర్తించింది. వీటిలో అత్యధికంగా ఒకటి లేదా ఎక్కువ మార్కులు వచ్చినా ఎవల్యూవేటర్లు పట్టించుకోకుండా లెక్కించినట్లు అధికారుల పరిశీలనలో తేలింది. మార్కులను వేసే సమయంలో తప్పులు ఎక్కువగా దొర్లినట్లు విద్యాశాఖ గుర్తించింది. రీ వెరిఫికేషన్, రీకౌంటింగ్ ఫలితాలు జూన్ 1వ తేదీన ఫైనల్ చేస్తామని విద్యాశాఖ వెల్లడించింది. వచ్చే ఏడాది నుంచి ఓఎంఆర్‌షీట్ డిజైన్లలో స్వల్పమార్పులు చేయాలని పదోతరగతి బోర్డుకు ఏపీ విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది.

## రాహుల్‌ను విమర్శించే స్థాయా నీది

**హైదరాబాద్:** బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్ రావుపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీపై రఘునందన్ రావు పరిధి దాటి మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. శుక్రవారం గాంధీభవన్‌లో మీడియాతో జగ్గారెడ్డి మాట్లాడారు. ఏది పడితే అది మాట్లాడవద్దని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మొట్టికాయలు వేస్తే.. రాహుల్ గాంధీ గురించి మాట్లాడుతు న్నారని చెప్పారు. రాహుల్ గాంధీని విమర్శిస్తే తాము చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు

# ట్రిపుల్ ఐటీ ప్రకటన జారీ

### నేటి నుంచి ఆన్ లైన్ లో ధరఖాస్తుల స్వీకరణ

**తొలిపొద్దు, నంగునూరు :** రాజీవ్ గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వ విద్యాలయం (ఆర్టీయూకేటీ) పరిధిలోని ట్రిపుల్ ఐటీలలో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ప్రకటన వెలువడింది. బాసర ట్రిపుల్ ఐటీలో 1500 సీట్లు, కొత్తగా మహబూబ్ నగర్ క్యాంపస్ లో 180 సీట్లు కలిపి మొత్తం 1680 మందికి ప్రవేశం కల్పిస్తారు. ఇటీవల పదో తరగతి ఫలితాల్లో రెగ్యులర్ విద్యార్థులు సాధించిన మార్కుల ఆధారంగా ప్రభుత్వ నిబంధనల మేరకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ అనుసరించి రెసిడెన్షియల్ ఇంటిగ్రేటెడ్ బీటెక్ కోర్సుల్లో సీట్లను భర్తీ చేస్తారు. రెండేళ్ల పీయూసీ (ఇంటర్ తో సమానం), నాలుగేళ్ల బీటెక్ కోర్సును కలిపి ఇంటిగ్రేటెడ్ బీటెక్ కోర్సు అని పిలుస్తారు. రెండేళ్ల పీయూసీ స్కోర్ ఆధారంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం బీటెక్ బ్రాంచ్ కేటాయిస్తారు.

**ఫీజుల వివరాలు...**

తెలంగాణ రాష్ట్రంలోని పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ఏడాదికి రూ.36 వేల ఫీజు చెల్లించాలి. ట్యూషన్ ఫీజు రీయింబర్స్మెంట్ కు అర్హులైన విద్యార్థుల చెల్లించాల్సిన అవసరం లేదు. ప్రవేశ సమయంలో ఆరోగ్య బీమా ఓసీ, బీసీ అభ్యర్థులు రూ.3,500లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ. 3,000లు చెల్లించాలి. క్యాషన్ డిపాజిట్ కింద అన్ని కేటగిరీల అభ్యర్థులు రూ.2,000లు




చెల్లించాలి. కోర్సు పూర్తయ్యాక క్యాషన్ డిపాజిట్ తిరిగి చెల్లిస్తారు. ఇతర రాష్ట్రాలు, గల్ఫ్ దేశాల్లో పని చేసే వారి పిల్లలు ఏడాదికి రూ.1.36 లక్షలు, ఎన్ఆర్ఐ విద్యార్థులు రూ.3 లక్షలు ట్యూషన్ ఫీజు చెల్లించాలి. అభ్యర్థులు ఈ-సేవ, మీ-సేవ, టీఎస్ ఆన్లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఓసీ, బీసీ అభ్యర్థులు దరఖాస్తు రుసుం రూ.500లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.450లు, ఇతర రాష్ట్రాలకు చెందిన(గ్లోబల్ కేటగిరీ) వారు రూ.1,500లు, భర్తీ కాకుండా మిగిలి పోయే గ్లోబల్ కేటగిరీ సీట్లలో ప్రవేశం పొందాలనుకునే తెలంగాణ రాష్ట్రానికి చెందిన అభ్యర్థులు రూ.1500ల దరఖాస్తు రుసుం చెల్లించాలి. ఎన్ఆర్ఐ అభ్యర్థులు వంద యూఎస్ డాలర్ల దరఖాస్తు రుసుం చెల్లించాలి

**ప్రవేశాల షెడ్యూల్, అర్హతలు...**

మే 31వ తేదీ నుంచి జూన్ 21 వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు. వికలాంగులు, సైనికోద్యోగుల పిల్లలు, ఎన్సీసీ, స్పోర్ట్స్, గ్లోబల్ కేటగిరీకి చెందిన వారి దరఖాస్తులను జూన్ 25 తేదీ వరకు స్వీకరిస్తారు.
జూలై 4 వ తేదీన ఎంపిక జాబితా విడుదల
జూలై 7 వ తేదీన తొలి విడత కౌన్సెలింగ్
విద్యార్థులు ప్రథమ ప్రయత్నంలో 2025-ఎస్సెస్సీ తత్సమాన పరీక్షలో రెగ్యులర్ గా ఉత్తీర్ణులై ఉండాలి. 31-12-2024 నాటికి 18 ఏళ్లు దాటరాదు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 21 ఏళ్లు నిండకూడదు.
పదో తరగతిలో మార్కుల ఆధారంగా మెరిట్ పద్ధతిలో ప్రవేశాలు కల్పిస్తారు.
నాన్ రెసిడెన్షియల్ ప్రభుత్వ పాఠశాలలు, జిల్లా పరిషత్, మున్సిపల్ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు వారి మార్కులకు ఒక్కో సబ్జెక్టు నాలుగు మార్కుల చొప్పున మొత్తం 24 మార్కులు అదనంగా కలుపుతారు.
బాసర ట్రిపుల్ ఐటీలో 85 శాతం సీట్లను స్థానికంగా, మిగిలిన 15 శాతం సీట్లను మెరిట్ కోటాలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ విద్యార్థులకు కేటాయించారు.
ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు ఆరు శాతం, బీసీ-ఏ ఏడు శాతం, బీసీ-బీ పది శాతం, బీసీ-సీ ఒక శాతం, బీసీ-డీ ఏడు శాతం, బీసీ-ఇలకు నాలుగు శాతం రిజర్వేషన్ ఉంటుంది.
ప్రత్యేక సీట్ల కింద వికలాంగులకు మూడు శాతం, సైనికోద్యోగుల పిల్లలకు రెండు శాతం, ఎన్సీసీ విద్యార్థులకు ఒక శాతం , స్పోర్ట్స్ కోటా కింద 0.5 శాతం సీట్లను భర్తీ చేస్తారు.
బాలికలకు 33.33 శాతం సీట్లను సమాంతరంగా కేటాయిస్తారు.
తెలుగు రాష్ట్రాల విద్యార్థులే కాకుండా వేరే రాష్ట్రాల వారికి, అంతర్జాతీయ విద్యార్థులకు, గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్న వారి పిల్లలకు అదనపు సీట్లు కేటాయిస్తారు.
విద్యార్థులకు వసతి, భోజన సౌకర్యాలతో పాటు, రెండు జతల యూనిఫాం, షూలు, ల్యాప్ టాప్ లు, ఇతర సౌకర్యాలు ఉచితంగా కల్పిస్తారు.

## చేర్యాల పట్టణ సమస్యలపై సీపీఐ నిరంతర పోరాటం

**తొలిపొద్దు, సిద్దిపేట ప్రతినిధి / చేర్యాల :** చేర్యాల పట్టణ సమస్యలపై సిపిఐ నిరంతరం పోరాడుతుందని ఆపార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ అన్నారు. చేర్యాల పట్టణ 11వ మహాసభ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్ లో జరుగగా ఈ సభకు సిపిఐ సీనియర్ నాయకులు అవుశర్ల కృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అందె అశోక్ హాజరై మాట్లాడుతూ.. చేర్యాల పట్టణ పరిధిలో నెలకొన్న స్థానిక సమస్యలపై సిపిఐ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తూ పట్టణంలో పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.




**చేర్యాల పట్టణ కమిటీ ఎన్నిక...**

పట్టణ కార్యదర్శిగా పొన్నబోయిన మమత సహాయ కార్యదర్శిగా సుంకోజు రజిత, కార్యవర్గ సభ్యులుగా కర్రె రవి, గోనె హరిప్రసాద్, ముద్దాల రాజు, గజ్జల సురేందర్, సీహెచ్ అశోక్, గోమారపు నర్సయ్య, తీగుల్ల కనకయ్య, వెలుగల యాదగిరి, పోలబోయిన యాదగిరి, జోగిని రాజు, గడ్డి పరమేష్, నాగరాజు, రవి, మురళి, సిద్ధులు, రాకేష్, కిరణ్, ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఈరి భూమయ్య డివిజన్ నాయకులు జంగలి యాదగిరి, అవుశర్ల కృష్ణ, నంగి కనకయ్య, సిద్దిరాం భద్రయ్య, నంగి సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

## దళిత విద్యార్థులపై వివక్ష తగదు

**తొలిపొద్దు, సిద్దిపేట :** గురుకుల విద్యార్థులు పై అనుచిత వ్యాఖ్యలు చేసిన గురుకులాల సెక్రటరీ సెక్రటరి అలుగు వర్షిణి పై చర్యలు



తీసుకోవాలని తెలంగాణ మాల మహానాడు సిద్దిపేట జిల్లా వ్యవస్థాపకులు కోదాది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ... పేద విద్యార్థులను బాత్రూంలు క్లీన్ చేసుకోవాలని, వంట చేసుకోవాలని, ఊడ్చుకొని తూడ్చుకోవాలని ఒక ఐఏఎస్ అధికారి మాట్లాడటం ఎంత వరకు సమంజసమన్నారు. 40 సంవత్సరాల సోషల్ వెల్ఫేర్ గురుకుల చరిత్రలో ఇంతటి మానవత్వం లేని సెక్రటరీని ఎక్కడ కూడా చూడలేదని మండి పడ్డారు. దళిత విద్యార్థుల కు మెరుగైన విద్యా అందించడం అంటే మీ ప్రభుత్వం హయాంలో సోషల్ వెల్ఫర్ దళిత విద్యార్థులను అవమానం పరచడమేనా అని ప్రశ్నించారు. తక్షణమే గురుకుల సెక్రటరీ ని తొలగించాలని సీఎం రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క లను డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో చిన్నకోడూరు, నంగునూరు, నారాయణరావు పేట మండలాల కన్వీనర్లు కటికే రవి, జెల్ల మహేందర్, శంకర్ పాల్గొన్నారు.

## జూన్ 3 వ తేదీ నుంచి భూ భారతి గ్రామ సభలు

**తొలిపొద్దు, నంగునూరు :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి చట్టం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ రెండవ తేదీన రాష్ట్ర వ్యాప్త అమలులో భాగంగా నంగునూరు మండలంలో జూన్ మూడవ తేదీ నుండి 19 వ తేదీ వరకు గ్రామ పంచాయతీల వారిగా గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు మండల తహశీల్దార్ సరిత తెలిపారు. రెవెన్యూ అధికారులతో కూడిన రెండు బృందాలుగా ప్రతి రోజు రెండు గ్రామాలలో గ్రామసభలు నిర్వహిస్తాయని తెలిపారు. తహశీల్దారు సరిత ఆధ్వర్యంలో జయసూర్య(గిర్దావర్-2), మహేందర్ (జూనియర్ సహాయకుడు), భవాని(రికార్డు సహాయకురాలు) రమేశ్(చైన్ మాన్), రాజు(వీఆర్ఏ, మైసంపల్లి)లతో ఒక బృందం, పయ్యావుల లింగం(గిర్దావర్-1) ఆధ్వర్యంలో సంతోష్(సహాయ గణాంక అధికారి), మల్లేశం(జూనియర్ సహాయకుడు, భాగ్య లక్ష్మి(జూనియర్ సహాయకురాలు), శ్రీనివాస్(వీఆర్ఏ, అంక్షాపూర్), రాజు(వీఆర్ఏ, ఖానాపూర్)లతో మరొక బృందం ఈ గ్రామ సభలను నిర్వహిస్తాయని తెలిపారు. భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు ఈ గ్రామ సభల్లో దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. ఆయా గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, అధికారులకు సహకరించాలని కోరారు. జూన్ 3 వ తేదీన నాగరాజుపల్లి, మైసంపల్లి , 4 వ తేదీన అంక్షాపూర్, అప్పలాయ చెరువు, 5 వ తేదీన ఘనపురం, నర్మెట, 6వ తేదీన ఖాతా, ఖానాపూర్, 9 వ తేదీన పాలమాకుల, వెంకటాపూర్, 10 వ తేదీన రాజగోపాలపేట, అక్కెనపల్లి, 11వ తేదీన గట్లమల్యాల, ముండ్రాయి, 12 వ తేదీన సంతోష్ నగర్, రాంపూర్, 13 వ తేదీన సిద్ధన్నపేట, మక్దుంపూర్, 16 వ తేదీన నంగునూరు, కొండంరాజుపల్లి, 17వ తేదీన బద్దిపడగ, తిమ్మాయిపల్లి, 18వ తేదీన దర్గపల్లి, కోనాయిపల్లి, 19వ తేదీన జెర్రిపోతుల తాండా లలో గ్రామ సభలు నిర్వహిస్తామని వివరించారు.

## రేషన్ సరుకుల పంపిణీలో పారదర్శకత

ప్రజా పంపిణీ వ్యవస్థలో డీలర్లే ముఖ్యమని, వారు బాధ్యతతో సరుకులు పంపిణీ చేయాలని,ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా ఉండేందుకు ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా సరకుల పంపిణీ చేపడుతుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వానికి మంచిపేరు తెచ్చేలా రేషన్ డీలర్లు పనిచేయాలని కోరారు. విజయవాడలో కలెక్టర్లు, పౌరసరఫరాలశాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. కూటమి ప్రభుత్వం నిర్ణయం మేరకు జూన్ 1 నుంచి డీలర్లు రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసరాల పంపిణీకి సిద్ధం కావాలని ఆదేశించారు. గతంలో కార్డుదారుల కుటు-ంబాలకు కుటు-ంబ పెద్దలా ఉన్న రేషన్ డీలర్లు అదే విధంగా ఇప్పుడు కూడా మనసుపెట్టి పనిచేసి లబ్ధిదారులకు గౌరవంగా సేవలందించాలన్నారు. రేషన్ దుకాణాల పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడటం, సరైన తూకంతో సరకులు పంపిణీ చేయటం, ధరలు, స్టాక్ బోర్డ్, పోస్టర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

# ప్రభుత్వ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి

### గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు దాసరి సుధాకర్

**తొలిపొద్దు నంగునూరు :** బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడంతో పాటు, ఐదో తరగతి పూర్తయిన విద్యార్థులను, ఏడో తరగతి పూర్తయిన విద్యార్థులను స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేర్పించి ప్రభుత్వం అందిస్తున్న చేయూతను సద్వినియోగం చేసుకోవాలని గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు దాసరి సుధాకర్, ప్రాథమిక పాఠశాల ఎల్ ఎఫ్ ఎల్ ప్రధానోపాధ్యాయుడు బండారి ప్రసాదరెడ్డి కోరారు. శుక్రవారం మగ్దుంపూర్ గ్రామంలో ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం ముందస్తు బడి బాట నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులతో గ్రామ సభ నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలను అందించి ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు. ఈజీఎస్ పనులు నిర్వహిస్తున్న వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లి అక్కడ గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని విద్యార్థుల




తల్లిదండ్రులు, గ్రామస్తులు అత్యధికంగా ఈజీఎస్ పనుల్లో నిమగ్నమై ఉన్నారన్నారని ఎక్కువ మంది దినసరి వేతనంతో కుటుంబాలను పోషిస్తున్నారని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలని సూచించారు. తమ పాఠశాలల్లో జరుగుతున్న విద్యా బోధన, ఇతర కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రతి విద్యార్థికి ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, రెండు జతల దుస్తులు, నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు చెప్పారు. గ్రంథాలయం, ప్రయోగశాలలతో అర్థవంతమైన బోధన అందిస్తామని చెప్పారు. ప్రతి నెల విద్యార్థుల ప్రగతిపై తల్లిదండ్రులతో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ఉన్నత చదువులు చదివి, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు విద్యార్థుల మానసిక, ఆర్థిక, కుటుంబ పరిస్థితులను అర్థం చేసుకుని అందుకు అనుగుణంగా విద్యాబోధన చేస్తారని చెప్పారు. స్థానిక ఉన్నత పాఠశాలలో డిజిటల్ బోర్డు ద్వారా విద్యా బోధనను అందిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలో విద్యార్థుల మానసిక, శారీరక ఆరోగ్యం కోసం యోగా, క్రీడలను నేర్పిస్తున్నట్లు చెప్పారు. కంప్యూటర్, సైన్స్ ల్యాబ్ లతో పాటు గ్రంథాలయ సౌకర్యం ఉంటుందన్నారు. ప్రత్యేకంగా స్పోకెన్ ఇంగ్లీషు తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి విద్యార్థికి ప్యూరిఫైడ్ మంచినీటిని అందిస్తామన్నారు. విద్యార్థులకు జీవన నైపుణ్యాలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. బాలికలకు ఆత్మ రక్షణ మెళకువలను నేర్పిస్తామన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు కాకుండా మన గ్రామంలో ఉన్నటువంటి పాఠశాలలోనే విద్యార్థులను చదివించాలన్నారు. ప్రతి విద్యార్థి రోజు బడికి వచ్చేలా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. పాఠశాల బోధన, మధ్యాహ్న భోజనం విషయంలో ఏమైనా లోపాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు దాతల సహాయంతో స్టేషనరీ, ప్లేట్లు, గ్లాసులు, బ్యాగులు, వాటర్ బాటిల్స్ , స్పోర్ట్ డ్రెస్సులు, టై బెల్టులు, పరీక్ష అట్టలు, రిబ్బన్లు అందించినట్లు వివరించారు. ప్రైవేటుకు వెళుతున్న విద్యార్థులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కత్తుల లక్ష్మారెడ్డి, ధీకొండ గోవర్ధన్, ముస్లి రాజు, ఎం.డి.రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

Editor : srilalitha, tholipoddu media house, gmail: tholipoddudigitalnews@gmail.com, mobile : 9966463377.